# ప్రముఖునికో బహిరంగ లేఖ

డియర్ మిస్టర్ ఫెర్నాండేస్‌గారు,

మీరు కులాసా అని తలుస్తాను. నేను క్షేమం. మీకు నేను రాసే మొదటి ఉత్తరం యిది. కారణం యిటీవల దినపత్రికల్లో నేను చదివిన ఓ వార్త. ఓ ఫంక్షన్‌లో మీరు పెప్సి కంపెనీ తయారీ అయిన శీతల పానీయాన్ని తాగడానికి యిస్తే దాన్ని చిరునవ్వుతో నిరాకరించారట.

ఇది చదివాక మిమ్మల్ని శ్లాఘిస్తూ ఓ లెటర్ రాయాలనిపించి యిది మొదలు పెట్టాను. పెప్సి అనే శీతల పానీయాన్ని మీరు తాగడానికి నిరాకరించడం నన్నెంతో ఆనందింపచేసింది. మీకు పెప్సి రుచి వ్యక్తిగతంగా నచ్చదని నేను అనుకోను. ఎందుకంటే దాని రుచి మీకు నచ్చిందో లేదో తెలుసుకోడానికి అసలు మీరు దాన్ని ఇంతదాకా మీ జీవితంలో తాగి వుండరని నా నమ్మకం. కాబట్టి వ్యక్తిగత కారణం కాక రాజకీయ కారణంగా మీకు పెప్సి రుచి నచ్చలేదని భావిస్తున్నాను. ఈ భావనకి పునాది మీకు అమెరికా అన్నా, అమెరికాలో పుట్టి మన దేశానికి వచ్చిన శీతల పానీయాలన్నా అయిష్టం అని నేను నమ్మడం. ఈ నమ్మకానికి తగ్గ అవకాశం 1977 ప్రాంతంలో మీరే ఇచ్చారు. అప్పుడు మీరు కేంద్ర ప్రభుత్వంలో మంత్రి పదవికి రాగానే, మన దేశంలోని అమెరికన్ శీతల పానీయ సంస్థ కొకాకోలాని వెడలగొట్టారు. ఈ కారణంగానే ఓ పెప్సీని మీరు తాగితే ఆ మేరకు పెప్సి సేల్స్ పెరిగి అది మన దేశంలో ఆర్థిక లాభం పొందడానికి చోటు యిచ్చినట్లవుతుందని భావించి, మీరు పైన వుదహరించిన సందర్భంలో పెప్సీని తిరస్కరించారని భావిస్తున్నాను.

మీలాగా నేను అమెరికా అన్నా, అమెరికాకి చెందిన ఏ వస్తువన్నా అసహ్యించుకుంటుంటాను. బూర్జువా పెట్టుబడిదారుడయిన అమెరికనుడిని యింకాస్త దెబ్బతీసే విధానాలను మీకు నా ఈ లేఖ ద్వారా విన్నవించు

కుంటున్నాను. ఈ కింది వాటిని మీరు బహిరంగంగా తిరస్కరిస్తూ అమెరికావాడి పొట్టలో కొట్ట ప్రార్థన.

త్వరలో ఈ తిరస్కరణని భారత ప్రజలంతా గుర్తించి మీలా తిరస్కరించడం మొదలెడితే కొన్ని భారీ అమెరికన్ కంపెనీలు మన దేశంనించి నిష్క్రమిస్తాయి. స్వతంత్రానికి పూర్వం గాంధీ బ్రిటిష్ వారి మిల్లు దుస్తులని తిరస్కరించిన రీతిలో ఈ వుద్యమం త్వరలో వూపందుకుంటుందని ఆశిస్తూ కొన్ని విధానాలని కింద పొందుపరస్తున్నాను.

1. ఇకమీదట మీరు ఓ వూరు నించి యింకో వూరుకి కారులో కాని, బస్సులో కాని, ఏ మోటారు శకటంలో కాని వెళ్ళడానికి తిరస్కరించండి. ఎందుకంటే అమెరికన్‌గాడే మోటారు శకటాన్ని కనిపెట్టింది. జనరల్ మోటార్స్ చరిత్ర మీకు తెలిసిందే కదా. ఫోర్డు కారు అంబాసిడర్, ఫియట్, మారుతి మొదలయిన కార్లుగా రూపాంతరం చెందింది. వీటన్నిటిలో యంత్రం పనిచేసే విధానం ఒకటే.

2. విదేశాలకి కాని, స్వదేశంలో ఓ చోటి నుంచి ఇంకో చోటికి కాని ప్రయాణానికి మీరు విమానం ఎక్కద్దు. ఇదీ రైట్ బ్రదర్స్ అనే అమెరికన్ కేపిటలిస్ట్‌ల సృష్టే. ఇండియన్ ఎయిర్‌లైన్స్, ఎయిర్ ఇండియాలో వుపయోగించే బోయింగ్ తరహా అన్ని విమానాలు అమెరికాలోని వాషింగ్‌టన్ స్టేట్‌లోని సియాటిల్ అనే వూళ్ళోని బోయింగ్ కంపెనీలో తయారయి మన దేశానికి దిగుమతి అయినవే అని ఈ సందర్భంలో మీ దృష్టికి తెస్తున్నాను.

3. మీరేతరహా రీఫిల్స్‌ని వాడతారో నాకు తెలీదు. కాని బాల్ పెన్స్‌ని కూడా మీరు వుపయోగించడానికి నిరాకరించండి. ఎందుకంటే బాల్ పెన్, రీఫిల్స్ కూడా రెనాల్డ్ అనే అమెరికన్ మహాశయుడి సృష్టి. ఏ ఫైవ్‌స్టార్ హోటల్‌లోనో ముందుగా ఏర్పరచుకున్న

విలేకరుల ముందు మీరు గెస్టు రిజిస్టర్‌లో సంతకం చేయడానికి ఇచ్చే బాల్ పెన్‌ని తిరస్కరించి, బాతు ఈకతోనే సంతకం చేస్తానని పట్టుబట్టండి. లేదా బయటకి నడవండి. (ఇంకు పెన్ను కూడా అమెరికా వాడి సృష్టే)

4. మీరు మీ ఇంటికి కావలసిన నెలసరి దినుసులు ఏ సూపర్ బజార్‌లో కొంటున్నారో నాకు తెలీదు కాని ఇకమీదట ఆ సూపర్ బజార్‌కి కాని, అసలు ఏ సూపర్ బజార్‌కి కాని వెళ్ళి కొనడాన్ని బహిష్కరించండి. ప్రపంచంలోని తొలి సూపర్ బజార్ అమెరికా లోని న్యూయార్కు నగరంలో 1917 లో కనిపెట్టబడింది. చిల్లరకొట్టు చిట్టెమ్మల దుకాణాలన్నీ తిరిగి, ఎక్కడేది దొరుకుతాయో అక్కడ అవి కొని, ఆ సంగతి కూడా దినపత్రికలో వచ్చేలా చూడండి.

5. మీ ఇంటి, ఆఫీస్ ఫోన్ నంబర్లు నాకు తెలీవు కాని వెంటనే వాటిని తిరస్కరించండి. అలెగ్జాండర్ గ్రహం బెల్ అనే అమెరికన్ బూర్జువా కేపిటలిస్ట్ టెలిఫోన్‌ని కనిపెట్టాడు. వాళ్ళు కనిపెట్టి అభివృద్ధి చేసిన పరికరాన్ని మనం ఇండియన్స్ వాడాల్సిన ఖర్మ దేనికి? గతంలోలా వార్తాహరుల్ని గుర్రాల మీద పంపించవచ్చు. టెలిగ్రాఫిక్ పద్ధతిని కనిపెట్టింది ఇటాలియన్ అయినా, వాడు అమెరికా వచ్చి ఓ కంపెనీ స్థాపించి దాన్ని వ్యాపారంగా మార్చాడు. అంచేత అమెరికాలో పుట్టిన ఆ సర్వీస్‌కి కూడా మనం దూరంగా వుందాం.

6. మీరు ఇంకా స్టార్ టి. వి. కనెక్షన్ పెట్టించుకున్నారో లేదో కాని మీ కలర్ టి. వి. ని అమ్మేయండి. అదీ అమెరికాలో కనిపెట్టిన పరికరమే. అయితే వి. సి. ఆర్. ని మాత్రం వుంచుకోండి. ఎందుకంటే దాన్ని జపాన్ భయ్యాగాడు కనిపెట్టాడు కనక. మీ ఫేవరెట్ హీరోయిన్ గ్రీటా గార్బొనా లేక సోఫియా లారెనా ఎలిజబత్ టేలర్ లేక జూలియా రాబర్ట్సా అన్నది మీ వ్యక్తిగత అభిరుచి మీద ఆధారపడి వుంటుంది. కాని ఇకమీదట

వారెవరి సినిమాలు చూడకండి. వారంతా అమెరికన్ స్టూడియోల్లో నటించే బూర్జువాలు. ఇక మీదట ఏ హాలివుడ్ సినిమాకి వెళ్ళకండి. జపాన్ నుంచి డబ్ అయ్యే సినిమాలు తప్ప ఇంకేవి చూడకండి.

7. మన దేశం చేసే అంతరిక్ష పరిశోధనలని ఖండించండి. అమెరికాలోనే ఈ పరిశోధనలు పుట్టింది, మొదట అంతరిక్షంలోకి వెళ్ళింది రష్యా వాడయినా.

8. కోల్ట్ అనే పెద్దమనిషి తొలిసారిగా పిస్తోలును అమెరికాలోనే కనుక్కున్నాడు. అందులోంచే స్టెన్‌గన్‌లు, మెషీన్‌గన్‌లు, కార్బన్‌లు, ఏ. కె. 47 లు మొదలయినవి పుట్టాయి. అంచేత మిలటరీ, పారా మిలటరీ, పోలీసు మొదలయిన శాఖల్లో రివాల్వర్‌లు, పిస్తోళ్ళు, తదితర అమెరికన్ బూర్జువా ఆయుధాలు వుపయోగించడాన్ని నిషేధించే ప్రయత్నం చేయండి.

9. సింగర్ అనే అమెరికన్ వెధవ కుట్టు మెషీన్‌ని కనిపెట్టాడు. మన దేశంలో సింగర్ కంపెనీ చాలా కాలం నడిచింది కూడా. అంచేత కుట్టు యంత్రాలని నిషేధించాలి మనం. గతంలోలా చేత్తో కుట్టిన బట్టలనే ధరించి, కుట్టు యంత్రాలతో తయారైన దుస్తుల ధారణని మీరు తిరస్కరించండి.

10. ఇంకా స్కాచ్ టేప్, కవరు, ఫ్రిజ్‌డేర్, పేపర్ బేగ్స్, ప్లాస్టిక్ బేగ్స్, పోలిథిన్ సీసాలు, పేపర్ కప్స్, దినపత్రికలు. పేపర్ ప్లేట్స్, మైక్రోఓవెన్, గేస్ స్టవ్, జెమ్‌క్లిప్, టైప్ రైటర్, పెన్సిల్, జీన్స్ పేంట్ లాంటి మనం నిత్య జీవితంలో వుపయోగించే మరో ముఖ్యమయిన 1247 వస్తువులని కూడా మీరు తిరస్కరించాలి. ఇవన్నీ అమెరికన్ పెట్టుబడిదారి వ్యవస్థ నించి పుట్టినవే.

వాటిని మీలాంటి వారు గట్టిగా తిరస్కరిస్తే మీ అడుగుజాడల్లో మిగిలిన జనతాదళ్ అభిమానులు, మీ అభిమానులు నడిచి, అమెరికన్ పెట్టుబడిదారుల పతనానికి తోడ్పడగలరు. ఆ

తరువాత మీరు మనదేశ ప్రధానమంత్రి అవడం తథ్యం. కనీసం దేశ ఆర్థిక, వాణిజ్య మంత్రిత్వ శాఖలు మీ అధీనంలోకి మరోసారి రాక మానవు.

మీ

అన్నాబత్తుల పుల్లన్న

పి. ఎస్: మీరు మంత్రయాక బుల్లెట్ ప్రూఫ్ వెస్ట్‌లని, అద్దాలని కూడా తిరస్కరించండి, అవన్నీ అమెరికన్ తయారీలే కాబట్టి. త్వరలో దేశం ఇంకాస్త బాగుపడొచ్చు.

# ఇట్స్ ఫన్నీ

జీవితంలో ఒకోసారి అనుకోని తమాషాలు జరుగుతూండటం కద్దు. ఇలాంటివి చెప్పుకోడానికీ వినడానికి కూడా సరదాగా వుంటాయి. పడక పడక ఓ మనిషి అంబులెన్స్ కిందే పడటంలో చిన్న తమాషా వుంది కదా! ఇలాంటివి నేను అమెరికాలో వుండగా కొన్ని దినపత్రికల నుంచి సేకరించాను. అలాంటి వాటిలో కొన్ని....

('శనివారం నాది' అనే నవలలో నేను సృష్టించిన మహాంతి అనే దురదృష్టపు దొంగ పాత్ర దాదాపు ఇలాంటి సంఘటనలనే నవల్లో ఆద్యంతం ఎదుర్కొని పాఠకులని నవ్విస్తాడు).

అమెరికాలో....

* కొందరు దొంగలు దారికాచి ఓ రైలును ఆపి, తపాలా వారి పెట్టెని దోచారు. అయితే వారనుకున్నట్లుగా మని ఆర్డర్ తాలూకు డబ్బు బదులు సంచులు నిండా వుత్తరాలే వున్నాయని ఇంటికెళ్ళాక తెలుసుకున్నారు.

* కుక్క కరవడంతో మెడికల్ ఖర్చులని క్లెయిమ్ చేసిన ఓ పాలసీదారుడి మెడికల్ బిల్స్ తనిఖీ చేయడానికి అతనింటికి వెళ్ళిన